12079601

కాలు జారిన మరలింప గలరుగాని
నోరు జారిన మరలింప లేరు సుమ్మి
మాట తప్పిన ఈ మనుజాలందు
దీక్ష పూనంగ వశము ఈ ధరణియందు

విద్యార్థులారా!

మాటకున్న విలువ నోటుకు కూడా లేదు. నోట్లు రెండు రకములుగా ఉంటున్నాయి. ఒకటి కరెన్సీనోటు. రెండవది ప్రామిసరీ నోటు. ఇందులో దేనియందు దానికుండవలసిన లక్షణములు లేనప్పుడు ఆనోట్లు పనికిరావు.

మాటకు ప్రాణము సత్యము
కోటకు ప్రాణము సుభట కోటి ధరిత్రిన్
బోటికి ప్రాణము మానము
నోటుకు ప్రాణము వ్రాలు సిద్ధమం...

ఇలాంటి తత్త్వము మనము మరచినప్పుడు మానవత్వమునే మరచిన వారమవుతాము.

విద్యార్థులారా!

మనము ఏమాటలు మాట్లాడవలసి వచ్చినప్పటికి మనం చక్కగా సమయ సందర్భములను పురస్కరించుకొని ఆ మాటలు మాట్లాడాలి. వినయ విధేయతలతో అప్రియం కాకుండా ఉండే వచనములను మనం వచించాలి. అప్రీతిగా ఉండకూడదు. వానికి ప్రీతికదా యని అసత్యమాడకూడదు. వారికి అప్రీతికదాయని సత్యము చెప్పకూడదు. సత్యమును సత్యముగానే మనం వచించాలి. ఎదుటివాని ఇష్టములు అయిష్టములు మనం యేమాత్రము విచారించనక్కరలేదు. మనం విశ్వాసముతో మాట్లాడాలి. ఈ మాటలు మనం ఈరీతిగా ఉపయోగించినప్పుడే సమాజములో మనకు గౌరవం ఉంటుంది. సమాజగౌరవమును, దేశగౌరవమును, జాతిగౌరవమును, వ్యక్తియొక్క గౌరవమును మనం కాపాడుకోవలసి వచ్చినప్పుడు మాటయే దీనికి ప్రాణము. మాటలు ప్రాణ సమానము.

నాలుకనిచ్చినదెందుకో తెలుసా
ఊరకే మాట్లాడే టందులకా
కాదు కాదు సత్యము పలికేటందులకు.

ఈ సత్యమే మాటకు ప్రాణము. దానమే హస్తమునకు ప్రాణము. మానవునకు ఆచరణయే ప్రాణము. మనము మాటలను వచ్చినట్లుగా ఉపయోగించుకొని కొన్ని అసత్యములను ఉపయోగించి తద్వారా మన గౌరవమును కోల్పోతున్నాము. మనకు అలంకారము ఏమిటి? సత్యమే మనకు అలంకారము. వేదమునందు సత్యంవద ధర్మంచర. ఈ విధమైన మన భారతీయ సంస్కృతిని పురస్కరించుకొని సంస్కారము పరిశుద్ధము గావించాలి. సర్వ అలంకారములు మన గుణములుగానే భావించాలి. శాంతము మహనీయుల భూషణము. మాట మానవుని భూషణము. ఆనందము దైవము యొక్క భూషణము. దైవానందమునందే సరియైన సుఖము లభ్యమవుతుంది. లోకసంబంధమైన ఆనందములు, ప్రాకృతి సంబంధమైన ఆనందములు, భౌతిక సంబంధమైన ఆనందములు క్షణభంగురమైన ఆనందములు ఆనందములు కావు.

ధన జన బల యిలాంటి గర్వముల చేత మనం అనేక విధములైన తప్పు మార్గములు పడుతున్నాము. ఈనాటి మన బలములన్నీ కూడా కదలిపోయే మేఘముల వంటివి. భుజబలము, బుద్ధిబలము, ధనబలము, మదబలము, సర్వబలములు కదలిపోయే మేఘములవంటివి.

బుద్ధిబలమం మరియు భుజబలమున్నను
దైవబలము లేక దీనుడగును
కర్ణుడంతటివాడు కడపటికేమయ్యె
మరువబోకు ఒట్టి మంచిమాట

భుజబలము, బుద్ధిబలము, అస్త్రబలము సర్వబలములు ఉంటున్నాయి కర్ణునికి. కర్ణుని, అర్జుని compare చేసినప్పుడు కర్ణుడే గొప్పవాడు. కొంతవరకు బలములో గొప్పవాడు అర్జునుడు. కానీ కర్ణుని యొక్క దానశీలత అర్జునునికి లేదు. ఆడిన మాట తప్పెడివాడు కాదు. కనుక దుర్మార్గుడైన దుర్యోధనునికి యిచ్చిన మాట తప్పించుకోలేక అతనికి లొంగిపోయాడు. ఇలాంటి త్యాగశీలుడు ధర్మశీలుడు అయిన కర్ణుడు కూడా దుష్టచతుష్టయములో నాలుగవవాడుగా తయారయ్యాడు. కారణము ఏమిటి? సంగదోషమే. దుష్టులతో మనం స్నేహం చేసినప్పుడు ఆ దుష్టభావములన్నీ మనలో ప్రవేశిస్తాయి. సద్గుణులతో మనం స్నేహం చేసినప్పుడు సద్భావములన్నీ మనలో ప్రవేశిస్తాయి. అగ్నితో బొగ్గు చేరినప్పుడు అగ్నిరూపాన్ని ధరిస్తుంది బొగ్గు. ఎట్టి సంబంధమో అట్టి స్వభావము. ప్రతి మానవుడు కూడా తన మాటయందు విశ్వాసమును అధికం గావించుకోవాలి. కాలు జారితే తప్పించుకోటానికి సాధ్యమవుతుంది గాని నాలుక జారితే తప్పించుకోటం సాధ్యం కాదు.

12079603

విద్యార్థులారా! మాటలు ప్రాణంగా భావించి, పెద్దలతోగాని తల్లిదండ్రులతోగాని, స్నేహితులతోగానీ, గౌరవనీయుల వద్దగాని మనం మాట్లాడేటప్పుడు చాలానిండుగా దండిగా సత్యం ఉండేటట్లు మనం మాట్లాడాలి. సుగ్రీవుని మంత్రి హనుమంతుడు. సుగ్రీవుని ఆజ్ఞతీసుకొని రామలక్ష్మణులతో మాట్లాడాలని వచ్చాడు. హనుమంతుని మాటలు విన్న రాముడు ఎంతయో ఆనందించాడు. తమ్ముడా! లక్ష్మణా! ఇతడు శాంతుడు, గుణవంతుడు, బలవంతుడు. అతని వచనములందే శాంతి తత్వం ప్రకాశిస్తున్నది. ఆ గౌరవమర్యాదలందే అతని గుణములు మనకు స్పష్టమవుతున్నాయి. ఇతని బలము చూద్దామా అంటే ఒక్కతూరి పర్వతము నుండి క్రిందికి వచ్చేశాడు. కనురెప్పపాటులో దిగాడు. మాతంగ పర్వతముపై ఉన్నవాడు చూస్తుండగనే క్రిందికి వచ్చాడు. మన మాటల చేతనే మన మంచి-చెడ్డలు స్పష్టమవుతూ ఉంటాయి. reaction, resound, reflection అన్నీ మన మాటల వలనే కలుగుతున్నాయి. ఈనాడు కలియుగ ప్రభావం చేత తేక ఆధునిక యుగము చేత ఎన్నివిధములైన దుష్కృత్యలు, ఎన్ని విధములైన అన్యాయములు జరుగుతున్నాయో జగత్తులో అందరికి తెలుసు.

మానవునికి రెండు రకములైన ఆశలుంటున్నాయి. ఒకటి ఆశ రెండవది దురాశ. ఆశ అనగా ఏమిటి? మానవునికి నిత్యజీవితములో అవసరమయ్యేవి కోరుకోటంలో తప్పులేదు. మన గౌరవ మర్యాదలు కుటుంబ గౌరవం కాపాడుకొనే నిమిత్తం తగిన అవసరాలుకూడా మనకు అవసరం. సమాజములో మన గౌరవం నిల్పుకునే నిమిత్తము కొన్ని రకములైన పదార్థములు అవసరమే. సమాజము యొక్క సంక్షేమము ను దృష్టిలో పెట్టుకొని సమాజ గౌరవం కాపాడటం మన కర్తవ్యం. ఈ సమాజము యొక్క గౌరవమే మన ప్రాంతము యొక్క గౌరవముగా ఉంటుంది. ఆ ప్రాంతము యొక్క, గౌరవమే మన దేశము యొక్క గౌరవంగా ఉంటుంది. కనుక మొట్టమొదట వ్యక్తి రెండవది సమిష్టి; మూడవది సమాజము, నాల్గవది దేశము. కనుక ఈనాటి విద్యార్థులందరు individual character పెంపొందించుకోవాలి. అదే వ్యక్తి యొక్క స్వరూపము. అదే వ్యక్తి యొక్క గౌరవం. అదే వ్యక్తి యొక్క విలువ. దాని తరువాత సమిష్టి. మన కుటుంబ గౌరవమును మనం కాపాడుకోవాలి. పూర్వకాలంలో ఏ సంబంధము చూసినా కుటుంబ గౌరమును మొట్టమొదట చూసేవారు. ఈనాడు కుటుంబము యొక్క గౌరవం ఏమిటో, వ్యక్తి యొక్క గౌరవము ఏమిటో ఏమాత్రము పాటించటం లేదు. నిత్యజీవితంలో దిన చర్యలకు అవసరమైన కార్యాలలో దీనిని కూడా మనం చేర్చుకోవాలి. ఇది సహజమైన ఆశే. ఇంక దురాశ. మీకందరికి తెలుసు. కొంతమంది ఎంతో ధనాశతో ప్రాణాలు తీసుకున్నారో చెప్పటానికి వీలుకాదు.

12079604

ఎక్కడ చూచినా సగుణము, బలము, చెలిమి అనేది లేదు. అంతా ధనమే. ధనమే, ధనమే...
ఎంతమంది ధనాన్ని సంపాదించారు. కాని ఈ ధనమంతా ఎక్కడికి పోతుంది. ఏం చేస్తున్నారు.
ఏమైనా మంచికార్యంగాని పుణ్యకార్యంగాని చేస్తున్నారా? Health and educationకి ఏమైనా
ఉపయోగిస్తున్నారా? ఏమాత్రం లేదు. పూర్వం రాజులు ఎంతమంది ధనాన్ని ఆశ్రయించి అభివృ
ద్ధిపరచుకున్నారు. ఎంత ధనము ప్రోగు చేసుకున్నారు? ఎంత పేరు ప్రతిష్ఠలు సంపాదించారు.
కాని వారెక్కడున్నారు ఇప్పుడు. పోయే సమయములో యింత మట్టి అయినా చేతిలో తీసు
కొని పోయారా? అయితే నిత్యజీవితములో మన గౌరవ మర్యాదలకు తగినట్లుగా మనం
సంపాదించుకోవాలి. అందులో తప్పు లేదు.

విద్యార్థులారా! మీరు చదివే చదువులన్నీ కూడా, యీనాటి చదువులన్నీ కేవలం ధన
సంపాదన నిమిత్తమని భావిస్తున్నారు.

ధనమున్నదని మీరు ఘనతగా పలికిన
పుడమియందుసుమంత శాంతి లేదు
విద్యాధికారిత్వ విఖ్యాతిగాగినగాని
పుడమియందిసుమంత శాంతి లేదు
ఎంత చదువు చదివి ఏరీతి యున్నను
హీనుడవగుణంబు మానలేడు
తరచి చదువు చదువ తర్కవాదమెగాని
పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు.

ఇదియే ఈనాటి విద్యలందున్న ఘనత. వాదోపవాదములు. ఈ వాదన చేయటం మంచిది కాదు
దీని వలన వైరం పెరుగుతుంది కాని శాంతం మనకు లభించదు. అన్నింటికి మనం సహనం
వహించాలి. మానవుడు తన జీవితంలో మానవత్వాన్ని సంరక్షించుకోవాలంటే 3Pలు సంర
క్షించుకోవాలి. మొట్టమొదటి P- purity. రెండవది patience. మూడవది
perseverence. ఈ మూడు మానవతా విలువలు. ఈ ప్యూరిటీ ఉండినప్పుడు నీవు సత్యధర్మా
లను ప్రకటిస్తావు. అనుభవిస్తావు. ఆచరిస్తావు ఆనందిస్తావు. శాంతి ఉండినప్పుడు ధర్మమును
అహింసను నీవు ఆచరిస్తావు. perseverence ఉన్నప్పుడు యీ ఇదంతటిని నీవు అనుభవి
స్తావు. ప్రేమ ఉన్నవాడు హింసలో ప్రవేశించడు. ధర్మమున్నవాడు హింసకు పాల్పడడు. సత్యం
ఉన్నవాడు అల్లర్లలో ప్రవేశించడు. శాంతి ఉన్నవానికి ఈ అల్లర్లు పనికి రావు. కనుక సత్యము

12079605

ధర్మము, శాంతి, ప్రేమ ఈ నాల్గింటిలో ఏ ఒక్కటి ఉన్నను వారు అహింసా ధర్మము పాటిస్తారు. అహింసకు ప్రత్యేక ప్రక్రియ మనం చేయనక్కరలేదు. ఇందులో ఏ ఒక్కటి ఉన్నా చాలు.

పాపభీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దాని బట్టి
మానవత్వ మణగె మానవునందున
విశ్వశాంతి కఱవు విప్లవంబు

పామరుడుగా ఉండవచ్చు. మేధావి కాక పోవచ్చు. గొప్ప తెలివి తేటలు లేనివాడు కావచ్చును. కాని పాపభీతి ఒక్కటి ఉంటే చాలు. ఎన్ని ధనకనక వస్తు వాహనాదులున్నప్పటికిని పాపభీతి లేక పోతే వాడు పామరుడే. కేవలం అజ్ఞానితో సమానము. కారణం ఏమిటి? పాపమంటే భయం లేదు.

ఒకానొక సమయంలో ప్రహ్లాదుడు తండ్రికి చెబుతున్నాడు. 'నాన్నా! ఎందుకు మీరీ విధంగా శ్రమపడుతున్నారు. అడవిలో క్రూరమృగములను చంపినట్లుగా మనుష్యులను చంపుతున్నారు. రాజ్యమును అభివృద్ధి గావించుకొనేందుకు అనేక హింసలను పాల్పడుతున్నారు. ఇంత మందిని చంపితే వచ్చే ఫలితము ఏమిటి? ఇది కాదు నీవు చంపవలసినది.

లోని రిపులకు లొంగిపోయిన వాడు
బయటి రిపుల నెట్లు పట్టగలడు?

ఉన్నారు నీలోనే పెద్ద దుర్మార్గులు. ఎవరు? కామ, క్రోధ, లోభ, మోహ, లోభ, మద, మాత్సర్యములు. ఈ అరిషడ్వర్గములనే దుర్మార్గులను ఉంచుకొని బయటి దుర్మార్గులను నీవు చంపుతున్నావు. ఇది చాలా తప్పు. మొట్టమొదట మనం చంపవలసినది కామక్రోధములను. వాటిని చంపినప్పుడే పాపభీతిని తగిన విధంగా కాపాడుకుంటాము.

రెండవది దైవప్రీతి. దేశములో శాంతి లేకుండా పోవటానికి కారణము ఏమిటి? పాపభీతి, దైవప్రీతి రెండు లేకుండా పోవటమే. ఎక్కడ చూచినా అడవులలో పల్లెలలో, పట్టణములలో, గుట్టమీద, ఎక్కడ చూచినా విప్లవములు అభివృద్ధి అయిపోతున్నాయి. ఎక్కడ ఇద్దరుంటే అక్కడ విప్లవమే. సహనము, సానుభూతి అదృశ్యమై పోయాయి. ఎక్కడ ఇద్దరున్నా అక్కడ గడబిడ అయిపోతున్నది. మీకు చాలామందికి తెలియకుండానే అనుభవముంటున్నది. ఒక గాజు చేతిన ఉంటే శబ్దమే ఉండదు. రెండు గాజులుంటే శబ్దము

12079606

ప్రారంభమవుతుంది. ఈనాడు కలియుగ ప్రభావము చేత ఎక్కడ ఇద్దరు చేరినా సహనము లేదు స్నేహము లేదు, సానుభూతి లేదు., దయా దాక్షిణ్యాము లేదు. సర్వత్ర స్వార్థము, స్వప్రయోజనము.

ఈనాటి విద్యార్థులు సమాజములో ప్రవేశించి దేశ సంరక్షణార్థై, సమాజము యొక్క సంక్షేమము నిమిత్తమై తగిన కంకణము కట్టుకోవాలి. ఇదియే మీరు చదివినందుకు సేవ. దేశసేవయందే మనకు శాంతి ఉంటున్నది. ఎందుకంటె మనము పుట్టటము పెరగటము అంతా సమాజమునందే జరుగుతున్నది. ఈనాడు మనము ఇంత గొప్పవారమైనామంటే సమాజము యొక్క ప్రోత్సాహము చేతనే. సమాజము యొక్క క్షేమము చేతనే. సమాజము యొక్క సహాయము చేతనే. ఈ సమాజమునకు తగిన కృతజ్ఞత నందించే నిమిత్తమై సమాజ సేవ చేయాలి. మాటలు మంచిగా పెట్టుకోవాలి. దీని వలనే మనకు నమ్మకము ఏర్పడుతుంది. 'పలికి బొంకుట కంటె పాపమున్నే' అన్నాడు బలిచక్రవర్తి. గురువైనా ధిక్కరించి సత్యములో ప్రవేశించాలి. శుక్రాచార్యుడు వద్దని చెప్పాడు. 'ఓ బలీ! అతను సామాన్యుడు కాడు. మూడడుగులు అడుగుతున్నాడు. సాక్షాత్ నారాయణ మూర్తి. అతనికి దానమునిస్తే బికారివై పోతావు.' 'స్వామీ భగవంతుడే వచ్చి చేయి చాచినప్పుడు ఇచ్చేది నేనెంత. తప్పక ఇస్తాను. నేను ఏగతియైనా పరవాలేద'న్నాడు. తన చేయి క్రింద వస్తుంది. నా చేయి పైన ఉంది. ఇచ్చేవాని చేయి పైన ఉంది. తీసుకునే వాని చేయి క్రింద ఉంది. ఇదే అదృష్టము అన్నాడు. సామాన్యమైన వాడు కాదు సాక్షాత్ నారాయణమూర్తి అడుగుతున్నాడు అంతకంటె మహాభాగ్యమా? ఈ భాగ్యమునకు ఏమైనా ధిక్కరిస్తాను. కనుక సత్యమునకు ఇచ్చిన మాట తప్పకుండా ఉండటానికి ఇదే మనకు సరైన గౌరవము. యవ్వనము కదలిపోయే మేఘము వంటిది. దీనికి పూర్వము లేదు తరువాత లేదు. మానవుని యవ్వనము కాలి క్రింద నీరు వలె కదలిపోతుంది. మధ్యలో వచ్చిన దానికి మనము మిడిసి పడకూడదు. భవిష్యత్తు లక్ష్యము నందుంచుకొని, సమాజము యొక్క క్షేమము దృష్టియందుంచుకొని చలించని మనస్సును, భ్రమించని దృష్టిని మనం అభివృద్ధి చేసుకోవాలి.

ఇంతే కాదు, తల్లి తండ్రులకు మంచి పేరు తేవాలి. వారు ఎన్నో విధములుగా మీ అభివృద్ధి కోసము పాటుపడుతున్నారు. ఎన్నో కష్టములకు వారు గురౌతున్నారు. మీరు బాగా చదివి గొప్ప అభివృద్ధికి రావాలని ప్రతి తల్లి తండ్రి ఆశిస్తుంటారు. కనుక తల్లి తండ్రులకు తగిన శాంతిని మనం అందించాలి. ఇది చదువులోనున్న పెద్ద సంస్కారము

12079607

చదువులన్ని చదివి చాల వివేకియై
మదిని తన్నెరుగడు మందమతి.

ఏమిటో చదువులంటా? కేవలం bookish knowledge. దీని వల్ల మనకొచ్చే పేరు ప్రతిష్ఠలు ఏమాత్రం లేవు. మనకు వచ్చేది మనము చేసే కర్మలద్వారా వస్తుంది. సమాజములో ప్రవేశించాలి. ఎక్కడ ఏవిధమైన బాధలున్నాయో అవి తొలగించాలి. సాధ్యమైనంత వరకు మన శక్తికి మించకుండా సహాయం చేస్తూ రావాలి. స్వామి చెప్పారు కదా యని త్యాగము త్యాగమని శక్తి మించి పోకూడదు. 'కడవెంతో రా నీరంతేరా, కావాలన్నా ఎక్కువ రాదురా' మన పాత్ర ఎంతో అంతే నీరు నిలుస్తుంది. నీరు అధికంగా కావాలంటే అందులో చేరదు. నీరు అధికంగా చేరాలని ఆశించినప్పుడు పాత్ర పెద్దది చేసుకో, హృదయము విశాలము చేసుకో. అప్పుడే నీలో విశాలభావములు అభివృద్ధి అవుతాయి

విద్యార్థులారా! మీలో ఆవరించే, ఆవిర్భవించే thoughts అనేకంగా ఉంటాయి. ఈ thoughts ని మొట్టమొదట మనము discriminate చేయాలి. Is it good or bad., right or wrong అని discriminate చేయాలి. తదుపరి దీన్ని కార్యములో ప్రవేశించాలి. తొందరపాటు మంచిది కాదు. haste makes waste, waste makes worry. so don't be in a hurry. ప్రతి దానికి టైము తీసుకో. కాలము ఎంతో విశాలమైనది. కాలమే దైవస్వరూపము. కాలమును మనం వ్యర్థపరచకూడదు. ఈ సమాజములో ఈనాడు ఏమి చేసినా తప్పుగానే వస్తున్నాది. ఉపకారము చేసినా అపకారముగా వస్తున్నాది. ఉపకారము కూడా ఎలాంటి పరిస్థితులలో చేయాలి అని యోచించాలి. అపకారికి కూడా ఉపకారము చేయవచ్చు. కానీ ఎంతవరకు చేయాలనేది విచారణ చేయాలి. పూర్వం చెప్పాను మహమ్మద్ ఘోరీ పదిహేడు పర్యాయములు పృథ్వీరాజుపై దండెత్తి వచ్చాడు. కానీ పృథ్వీరాజు ఈ పదిహేడు పర్యాయములు అతనిని క్షమించి వదలిపెడుతూ వచ్చాడు. ఎంత దయ. కాని యిది మితి మీరిన దయగా రూపొందింది. మితి మీరినప్పుడు మతి తప్పుతుంది. అందువలనే అప్పుడప్పుడు చెబుతుంటాను 'మితంతిండి అతిహాయి, అతి తిండి మతిహాని.' కాని ఈ పదిహేడు పర్యాయములు క్షమించినప్పటికి కృతజ్ఞత లేకపోయింది. పద్దెనిమిదవ పర్యాయము తిరిగి పృథ్వీరాజుపై దండెత్తి వచ్చాడు. పృథ్వీరాజు బావమరది సహాయము తీసుకున్నాడు. లోకములో మొట్టమొదటినుండి యిదే జరుగుతున్నది. భారతదేశము స్వాతంత్ర్యము సాధించిందిగానీ ఐకమత్యము సాధించటం లేదు. మొదటినుండి ఐకమత్యము లేక

12079608

పోవటం చేతనే భారతదేశము యిన్ని అవస్థలను గురైపోయింది. పృథ్వీరాజు సోదరినే వివాహము చేసాడు అతనికి. అలాంటివాని స్నేహము చేసుకొని ఈ మహమ్మద్ ఘోరీ తిరిగి యితనిపై దండెత్తి వచ్చాడు. కానీ తలవని తలంపుగా రావటం చేత పృథ్వీరాజు చిక్కిపోయాడు మహమ్మద్ ఘోరీ చేతిలో. చిక్కినాడు కదా. తాను ఒక్క పర్యాయమైనా క్షమించవచ్చు కదా! నిర్దయుడైపోయి, కాఠిన్యము వహించి కన్నులు తీసాడు. చూశారా? ఇంత ఉపకారము చేసినవానికి ఎంత అపకారము చేశాడో. కనుక ఉపకారము యీవిధంగా పోకూడదు. ఒకటి రెండు పర్యాయములు క్షమించినా మితిమీరిన సమయములో మీరు క్షమాపణకు పూనుకోకూడదు. అది మీకే ముప్పుగా వస్తుంది. కనుక అందరి యందు మంచి భావము పెట్టుకోండి. కాని కొన్ని కొన్ని సమయ సందర్భములు పురస్కరించుకొని చాలా జాగ్రత్తగా మెలగాలి. మనం ఎంత శాంతముగనో, ఎంత మధురముగనో, ఎంత ప్రేమగనో పలుకులు నేర్చుకోవాలి. ఎవరి తృప్తి కోసమో కాదు. మన తృప్తి కోసం నేర్చుకోవాలి.

మనకు కోపం వస్తుంది. కొన్ని విధములైన అల్లకల్లోలములు జరుగుతుంటాయి హృదయములో. తగిన రీతిగా మనం సాధించుకోటానికి, శాంత పరుచుటకు తగిన కృషి చేయాలి. కోపం వచ్చింది కదా యని తక్షణమే ప్రవేశపెట్టకూడదు.

కోపము కల్గినవానికి
ఏ పనియు ఫలింపకుండు ఎగ్గులు కలుగున్
పాపపు పనులను చేయించు
భపాప్ముని పించుకొనుట చేకురు సుమీ।

ఇంతేకాదు

తనకలిమి భంగపుచ్చును
తనకుంగల గౌరవంబు దగ్ధము చేయున్
తన వారలకెడ చేయును
జనులకు కోపంబు వలన సర్వము చెడున్.

కోపం వచ్చినప్పుడు చిన్న చిట్కాలుంటాయి కోపం చల్లార్చుకొనేందుకు. విద్యార్థులారా! మీకు కోపం వచ్చిన తక్షణమే ఆ స్థానం వదలండి. అది మొట్ట మొదట చేయవలసింది. లోపలకు వెళ్ళి అద్దం తీసుకొని నీ ముఖము నీవు చూసుకో. అప్పుడు నీకే అసహ్యమనిపిస్తుంది. వికారంగా కనిపిస్తుంది. శూర్పణఖ వలె కనిపిస్తుంది. కనుక నీ కోపంపై కోపం వస్తుంది. ఈ కోపం అనేది ఎప్పుడు రాకూడదు అనుకోవాలి. అప్పటికి కోపం తగ్గకపోతే బాత్ రూమ్‌కి వెళ్ళు. Tap తిప్పు.

నీరు బకెట్ లో కారుతూ ఉంటుంది. దానిని శృతిగా చేసుకొని పాట పాడు. దైవ నామస్మరణ చేయి. నీ కోపం పోతుంది. ఇంకా పోకపోతే చల్లని నీరు ఒకగ్లాసు తీసుకొని త్రాగు. సాధ్యమైనంతవరకు దీనితో నిల్చిపోతుంది. ఇంకా ఉంటే పర్లాంగు లేక రెండు ఫర్లాంగులు quick walk చేయి. నయమై పోతుంది. మన ప్రాచీనులంతా ఈ విధంగా తమ నైజగుణములను సక్రమమైన మార్గములో నడిపిస్తూ వచ్చారు. ఆనాటి వాటన్నిటికి ఊరకమైన పిల్స్ ఇచ్చేవారు. ఈనాడు anxietyకి ఒక పిల్ ఇస్తాడు. వేసుకోనగానే మత్తు వచ్చి నిద్రపోతాడు. ఈ పిల్స్ మనం వేసుకోకూడదు. ఏ పిల్స్ కావాలి మనకు? భగవన్నామమే. ఇదే కలియుగములో ప్రధానమైనది. ఈ నామస్మరణ మనం చేస్తుంటే దీనికి మించినది ప్రపంచములో లేదు. కనుక మనం నామస్మరణ చేయాలి. ఈ నామము చేతనే మన యొక్క దౌర్భాగ్యం, అశాంతి కాంతవరకు అణచి పెట్టి శాంతిని పెంపొందించి ఆనందమును చేకూరుస్తుంది. ఈ కలియుగములో మనకున్న శక్తి ఏమిటి?

నాస్తి నాస్తి మహాభాగ కలికాలసమం యుగం
స్మరణాచ్చింతనా దేవ ప్రాప్తోతి పరమా గతిః.

ఈ కలికాలములో నామముకంటె గొప్పది మరొకటి లేదు. నామస్మరణయే తగినమందు. కృతయుగమందు ధ్యానం, త్రేతాయుగమునందు యజ్ఞం, ద్వాపరయుగమందు అర్చనం. మరి కలియుగమందు నామస్మరణ. ఎంత సులభమైన మార్గము! కృత, త్రేతా, ద్వాపర యుగముల కంటె చాలా సూక్ష్మమైన మార్గము. ఇంత సూక్ష్మమైన మార్గమును కూడా మనము అవలంబించలేకపోతున్నాము. అనుసరించలేకపోతున్నాము. ఒక్క రెండు నిముషములైనా కూర్చోలేకపోతున్నాము. ఇంక ఏ విధంగా తపస్సు చేయగలం? ఇది సాధ్యం కాదు. కనుక నామస్మరణ చేయాలి. స్మరణ కంటె మించినది లేదు. కనుక భగవన్నామాన్ని చింతిస్తూ మనలో ఆవిర్భవించే దుర్గుణములను క్రమక్రమేణా చల్లబరుస్తూ ఈ గానంలో ఎంత ఆనందముందో చూడండి.

అందుకోసమే భగవంతుని గానలోలుడన్నారు. గాన ప్రియుడని చెబుతారు. తుంబుర నారదులు ఎప్పుడూ నారాయణుని దగ్గర గానం చేస్తూ ఉంటారు. వారికదే పని. దీనితో భగవంతుడు నిరంతరం తన్మయుడై ఉండేవాడు. ఆ గానములో అంత ఆనందముంది. మనస్సును ఆకర్షిస్తుంది. మనస్సును మురిపిస్తుంది. హృదయమును మురిపిస్తుంది. తన్మయము గావిస్తుంది. గానమునకు ఇంత విలువ ఉంటున్నది. శృతిలయ తాళములు తెలియకపోయినా మన హృదయమునుండి ఆవిధమైన ఆవేదన రావాలి. నారదునకు కుటుంబము లేదు. ఎప్పుడూ నారాయణ నామాన్ని స్మరిస్తూ ఉండేవాడు. నారాయణుని దగ్గరకు వెళ్ళాడు. స్వామీ! నేను గానము చేస్తున్నాను.

నీకు తృప్తి నాకు తృప్తి. కానీ అర్థము తెలుసుకోవాలని యిష్టముగా ఉందన్నాడు. రామనామములోనున్న అర్థము నీకు యింతవరకు తెలియదా అన్నాడు నారాయణుడు. చెట్టుపై చిలుక ఉంటున్నది ఆ చిలుక నడుగు అన్నాడు. సరే భగవదాజ్ఞ శిరసా వహించి వెళ్ళాడు. ఓ చిలుకా రామా అంటే ఏమిటి అర్థము తెలుసా అడిగాడు. రామా అనేటప్పటికి ఆ చిలుక చెట్టుపై నుండి క్రిందపడి ప్రాణం విడిచింది. ఇదేనా అర్థము. రామా అంటే ప్రాణము పోవటమా అర్థము అనుకున్నాడు. అంతరార్థము ఉంటున్నదని పట్టుపట్టాడు నారదుడు. తెలుసుకోవాలనే పట్టుదల రావాలి. ఓర్పు కావాలి. 'నారాయణా! మీరు చెప్పినట్లు చిలుకను అడిగాను. రామా అంటే అది క్రిందపడి ప్రాణం విడిచింది. ఎంత పాపిని' అన్నాడు. నీవు అర్థం తెలుసుకోవాలంటే పట్టు పట్టు. ఒక బ్రాహ్మణుని యింటిలో ఇప్పుడే ఆవుకు దూడ పుట్టింది. ఆ దూడను పోయి అడుగు చెబుతుంది అన్నాడు. దగ్గరకు వెళ్ళాడు. యజమాని పట్టుకుని కొడతాడో యేమోనని పక్షికి జరిగినట్లు జరుగుతుందో యేమోనని భయమే. నారదుడు వచ్చాడంటే యజమాని పాలు తీసుకురావటానికి లోపలకు వెళ్ళాడు. మెల్లగా దూడను అడిగాడు. ఓ దూడా! రామా అంటే అర్థం ఏమిటి అన్నాడు. రామా అనేటప్పటికి తోక ఆడించుతూ ప్రాణం విడిచింది. ఇంకేమి చేయాలి. యజమాని వచ్చేటప్పటికి వెళ్ళిపోయాడు. తిరిగి నారాయణుని దగ్గరకు వెళ్ళాడు. 'నారాయణా ముందు కథే జరిగింది. దీని అర్థము యింతేనా అన్నాడు. 'కాదు కాదు ఈ రాజ్యములో ఒకరాజు ఉన్నాడు. ఆ రాజుకు లేక లేక ఇప్పుడే ఒక కుమారుడు పుట్టాడు. ఆ కుమారుని పోయి అడుగు చెబుతాడు' అన్నాడు. దైవాజ్ఞ బయలుదేరాడు. కొంతదూరము పోయి తిరిగి వెనుకకు వచ్చాడు. 'నారాయణా పక్షికి దిక్కు ఎవరు లేరు. ఆవు దూడకు దిక్కు ఎవరు లేరు. నన్ను పట్టుకు అడిగేవారు లేరు. రాజకుమారుని ఆ ప్రశ్న అడిగినప్పుడు రాజకుమారుడు మరణిస్తే నన్ను బంధిస్తారు. నీ దర్శనం లేకుండా పోతుంది. సరే ఏమైనా అవనీ నీ ఆజ్ఞ అని బయలుదేరాడు. నారదునికి రాజు స్వాగతము చేశాడు! బ్రహ్మ మానసపుత్రుడవు. రండి స్వామి రండి ఇప్పుడే కుమారుడు పుట్టాడు ఆశీర్వదించండి' అన్నాడు. లోపల భయమే. పైకి నవ్వుతూ వెళ్ళాడు. బంగారు తట్టలో పెట్టుకొని చెలికత్తెలు తెచ్చారు. నాయనా! కుమారా! శతమానం భవతి శతాయుష్మాన్ అని మంత్రాలు చెప్పాడు. రాజుకు తెలియదు కదా యని సంస్కృతములోనే ప్రశ్నించాడు మంత్రములో కలిసి పోయేటట్లు. రాజకుమారా రామా అంటే అర్థము ఏమిటి. అప్పుడు రాజకుమారుడు ఫక్కున నవ్వాడు. నారదుడు కూడా నవ్వాడు. రాజకుమారుడు మరణించలేదు. మాట్లాడాడు. అదృష్టమనుకున్నాడు. రాజకుమారుడు చెబుతున్నాడు 'బ్రహ్మ మానసపుత్రా! నేను చెట్టుపైన చిలకగా ఉండినప్పుడు మీరు వచ్చి రామ

నామము అర్థమేమిటి అని ప్రశ్నించారు. రామ అనే నామము వినేటప్పటికి నాకు మోక్షము కలిగింది. దేహాన్ని విసర్జించాను. ఒక్కసారి రామా అని వినేటప్పటికే జన్మసార్థకమైంది. తిరిగి బ్రాహ్మణుని యింట్లో గోవుకు దూడనై జన్మించాను. అక్కడకు వచ్చి రామనామము అర్థము బోధించమని అడిగారు. రామనామము విని ఆజన్మకూడా విసర్జించాను. తిరిగి యిప్పుడు రాజకుమారుడుగా పుట్టాను. చూశారా రామనామ శ్రవణముతో ఇంత మార్పు. పక్షి ఎక్కడ, దూడ ఎక్కడ, రాజకుమారుడెక్కడ. ఉన్నత పదవికి వచ్చేను. నామాన్ని విన్నంతనే యింత గొప్ప మార్పులు కలుగుతుంటే నామము స్మరించినంత మాత్రమున ఎంత గొప్ప మార్పు జరుగుతుంది. ఇదే జన్మసార్థకమునకు మూల కారణము.